క్లుప్తంగా

ఉమాకవికి సత్కారం



ఉమాకవిని సత్కరిస్తున్న సాంస్కృతిక సంస్థ ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్: ఆడవరం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.ఉమామహేశ్వరరావుకు వివేకానంద జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో ప్రశంసాపత్రం, మెమెంటోలతో ఆదివారం సత్కరించారు. త్యాగరాయ గానసభలో సాహిత్యం, నాటక రంగంలో ప్రతిభ కనపరిచినందున తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్, తెలుగు కళారత్న సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షులు ఉషారాణి, ఎం.వి.రత్నం చేతుల మీదుగా ఈ సత్కారం అందుకున్నారు.

ఈవేమనకు పురస్కారం



ఈవేమన

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని జెండాలవీధికి కవితా నిలయం వ్యవస్థాపకుడు, శ్రీశ్రీ కళావేదిక ఉత్తరాంధ్ర అధ్యక్షుడు ఈవేమన (మహ్మద్ రఫీ) తెలుగు కీర్తి ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సాహిత్యానికి చేస్తున్న కృషికి గాను శ్రీశ్రీ కళావేదిక, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ బుక్ ఆఫ్ రికార్డు, వరల్డ్ రైటర్స్ ఫోరం వరల్డ్ పోయిట్రీ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో జనవరి 21న విజయవాడలో ఈ అవార్డు అందుకోనున్నారు.

పట్టుశాలీల సంక్షేమానికి కృషి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్, సంఘు ప్రతినిధులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పట్టుశాలీ కులస్తుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలో పట్టణ పట్టుశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వంశధార ప్రాజెక్టు కమిటీ చైర్మన్ అరవల రవీంద్రబాబు, సంఘు అధ్యక్షుడు గుంటుకు చంద్రశేఖర్, పేకల రామకృష్ణ, అల్లంశెట్టి మల్లేశ్వరరావు, పోలిశెట్టి మల్లిబాబు, అల్లంశెట్టి మోహనరావు, మందుల మోహనరావు, రాజాపంతుల కృష్ణమోహన్, గుంటుకు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గోకులాలు ప్రారంభం



గోకులాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

జి.సిగడాం: మండలంలోని సంతవురిటి ఆనందపురం, ఆబోతులపేట గ్రామాల్లో పశువుల కోసం ఏర్పాటు చేసిన గోకులాలను ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బుడారి లక్ష్మణరావు, చిత్తిరి మోహన్, ఎంఎంఎస్ అధ్యక్షురాలు శిర్రా లక్ష్మి, నాయకులు బాలబొమ్మ వెంకటేష్, కుమరాపు రవికుమార్, పిల్లల శివకుమార్, బత్తుల సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

దేశ ఆర్థికాభివృద్ధిలో బిల్డర్ల పాత్ర కీలకం



మాట్లాడుతున్న ఎస్‌బీఐ ఆర్ఎం అబ్దుల్ హసీబ్ అమీర్

శ్రీకాకుళం అర్బన్: దేశ ఆర్థికాభివృద్ధిలో బిల్డర్ల పాత్ర కీలకమని భారతీయ స్టేట్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ అబ్దుల్ హసీబ్ అమీర్ అన్నారు. శ్రీకాకుళంలోని ఓ హోటల్లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రీజనల్ బిజినెస్ ఆఫీస్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాలోని బిల్డర్లతో సమావేశం నిర్వహించారు. రుణాలు, పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ సత్యనారాయణ, క్రెడాయ్ అధ్యక్షుడు రమేష్ చక్రవర్తి, ఏజీఎం గోవిందరావు, ఉదయ్‌కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అల్లినగరంలో దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

ఎచ్చెర్ల క్యాంపస్: అల్లినగరంలో జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 200 మంది పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీఎం జైరామ్, సేవాదల్ ప్రతినిధి రమణబాబు పాల్గొన్నారు.

కర్పూర జ్యోతి వేడుకలకు వేళాయె..!



అలంకరణలో అయ్యప్పస్వామి

- రేపు బలగ అయ్యప్పస్వామి ఆలయంలో ఉత్సవం
- మకరజ్యోతి తరహాలో ప్రత్యేకంగా నిర్వహణ
- రెండున్నర దశాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయం



కర్పూర జ్యోతి దర్శనం (ఫైల్)

శ్రీకాకుళం కల్చరల్: శబరిమలలో మకర సంక్రాంతి నాడు అయ్యప్పస్వాములకు మకరజ్యోతి కనువిందు చేస్తూ దివ్యానుభూతిని కలిగిస్తుంది. అదే తరహాలో బలగలోని అయ్యప్పస్వామి దేవాలయంలోనూ కర్పూర జ్యోతి వేడుకను అంగరంగ వైభవంగా నిర్వహిస్తుంటారు. రేపు జరిగే ఈ ఉత్సవానికి నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రెండున్నర దశాబ్దాల ఆనవాయితీని కొనసాగిస్తూ ప్రత్యేక పూజా కార్యక్రమాలకు సిద్ధమవుతున్నారు.

నిత్యపూజలతో అలరారుతూ..

భక్తులకు ఆరాధ్యదైవం, కలియుగంలో పాపాలను తొలగించే ఆనందధామంగా అందరిని రక్షిస్తున్న దైవం అయ్యప్పస్వామి. జిల్లా కేంద్రాన్ని ఆనుకుని ఉన్న బలగ వద్ద పవిత్ర నాగావళి నదీ తీరాన అయ్యప్పస్వామి దేవాలయం వెలసింది. ఇక్కడ నిత్యం పూజలు, ఉత్సవాలు, భక్తులతో వైకుంఠధామంగా అలరారుతోంది. ఇతర ప్రాంత పర్యాటకులను సైతం ఆకర్షించేలా ఆలయ నిర్మాణం జరిగింది. ఇక్కడ ప్రతి ఏడాది అయ్యప్పస్వామి ఉత్సవాలను క్రమం తప్పకుండా కేరళ రాష్ట్రంలోని శబరిమలలో జరిగిన పద్ధతిలోనే ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. ముఖ్యంగా మకర సంక్రాంతి రోజున శబరిమలలో మకరజ్యోతి దర్శనం ప్రత్యేకం కాగా ఇక్కడ కర్పూర జ్యోతి దర్శనం ప్రత్యేకంగా నిర్వహిస్తారు.

విశేష పూజలు..

సంక్రాంతి నాడు ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పట్టు వస్త్రాల సమర్పణ, మణిమయ మకుట ఆభరణ అలంకరణ అనంతరం భక్తులకు దర్శనం ఉంటుంది. సాయంత్రం దివ్య మకర జ్యోతి దర్శన సమయంలో అయ్యప్ప స్వామికి కర్పూర జ్యోతి దర్శనం ఉంటుంది. స్వామివారి ఉత్సవమూర్తిని మంగళవాయిద్యాలు, బాణసంచా వెలుగులు, చతుర్వేద పారాయణ, ఏకాదశ చత్ర సేవతో అయ్యప్పస్వామిని ఊరేగిస్తారు. భక్తుల శరణు ఘోష నడుమ తిరువీధి జరుగుతుంది. ఆలయ కమిటీ వారు భక్తులకు ఉచితంగా కర్పూరం పంపిణీ చేస్తారు. ఈ వేడుకను కనులారా చూచి తరించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరుతున్నారు.

26 ఏళ్లుగా సంక్రాంతి ఉత్సవాలు..

1978లో శ్రీకాకుళం నుంచి ఉమాదీక్షిత్, ప్రేమిజీ ఆధ్వర్యంలో అయ్యప్ప వ్రతాలు, శబరిమల యాత్ర ప్రారంభమైంది. నాటి నుంచి ప్రతి ఏడాది భక్తుల సంఖ్య రెట్టింపు అవుతూ వస్తోంది. భక్తుల సంఖ్య పెరుగుతుండటంతో ఆలయ నిర్మాణం తలంపు భక్తులలో మొదలైంది. దాని ఫలితంగా ఈ ఆలయాన్ని నిర్మించారు. 26 ఏళ్లుగా అయ్యప్పస్వామి శబరిమలలో మకరజ్యోతి దర్శనం రోజున అంటే సంక్రాంతి పర్వదినాన ఇక్కడి ఆలయంలో కర్పూర జ్యోతి దర్శనాలకు కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏర్పాట్లు పూర్తి



సంక్రాంతి పర్వదినం నాడు శబరిమలలో మకర జ్యోతి దర్శనం సమయంలో ఇక్కడికి వచ్చే భక్తుల కోసం దివ్యమైన కర్పూర జ్యోతి దర్శనం ఏర్పాటు చేశాం. ప్రతి ఏడాది నిర్వహిస్తున్నాం. ఇప్పటికి 26 ఏళ్లుగా జరుగుతోంది.

– దేవరకొండ శంకరనారాయణ, అర్చకుడు

వైఎస్సార్‌సీపీలో నూతనోత్సాహం



నూతనంగా పదవులు పొందిన పార్టీ నేతలను సత్కరించిన గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం/ఎచ్చెర్ల/జి.సిగడాం : వైఎస్సార్ కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యంగా పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పలువురు నాయకులకు పదవులు రావడంతో నూతనోత్సాహం వచ్చిందని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. రణస్థలంలోని వైఎస్సార్‌సీపీ ఎచ్చెర్ల నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఇటీవల పార్టీలో వివిధ హోదాల్లో నియమితులైన వారికి అభినందనలు తెలిపి దుశ్శాలువతో సత్కరించారు. ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి పార్టీ కమిటీ వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సనపల నారాయణరావు, జిల్లా ఉపాధ్యక్షులుగా బొంతు సూర్యనారాయణ, జిల్లా అధికార ప్రతినిధిగా పిల్లల శివకుమార్, సెక్రటరీ ఆర్గనైజర్‌గా పాసపు రామదాసు (ముకుంద), యాక్టివేట్ సెక్రటరీగా పేడాడ శ్రీరామమూర్తిని నియమించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడి పోరాడే పార్టీ వైఎస్సార్‌సీపీయేనని అన్నారు. కష్టపడి పనిచేసే ప్రతీ ఒక్కరిని పార్టీ తగిన సమయంలో గుర్తించి సముచితమైన స్థానం కల్పిస్తుందనడానికి తాజా పదవులే తార్కాణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత వివేకానంద



శ్రీకాకుళం న్యూకాలనీ: అంబేడ్కర్ ఆడిటోరియంలో స్వామి వివేకనంద వేషధారి నడుమ నృత్యప్రదర్శన

వివేకానందుడిని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఆదివారం శ్రీకాకుళం, ఎచ్చెర్ల నియోజకవర్గాల వ్యాప్తంగా స్వామి వివేకానంద విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. – సాక్షి నెట్‌వర్క్



గార: అంపోలు హైస్కూల్ వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఏబీవీపీ సభ్యులు



శ్రీకాకుళం అర్బన్: గాంధీ మందిరంలో..



జి.సిగడాం: ధవళపేటలో వివేకానందుడి చిత్రపటానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామమూర్తి, నాయకులు



రణస్థలం: జె.ఆర్.పురంలో..



ఎచ్చెర్ల: లావేరు గ్రంథాలయంలో వివేకానంద చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న లైబ్రేరియన్ శ్రీనివాసరావు

కుమారరాజుకు ప్రశంసాపత్రం



కుమారరాజు

శ్రీకాకుళం కల్చరల్: సాహిత్య చైతన్య కిరణాలు ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆన్‌లైన్‌లో కవి సమ్మేళనం నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమారరాజు వివేకానందునిపై రాసిన కవితకు వివేకానంద ప్రశంసాపత్రం అందజేశారు.

పేదలకు దుస్తుల వితరణ



దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

రణస్థలం: బంటుపల్లి పంచాయతీలో పేద ప్రజలకు ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు సంక్రాంతి పండుగ సందర్భంగా ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. నియోజకవర్గ ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

సెంట్రల్ లైటింగ్ స్తంభాలు ధ్వంసం



విరిగిపోయిన సెంటర్ లైటింగ్ స్తంభం

శ్రీకాకుళం : నగరంలోని పాలకొండ రోడ్డులో డివైడర్‌పై చెట్లు తొలగిస్తున్న సమయంలో మున్సిపల్ యంత్రాంగం నిర్లక్ష్య ధోరణి వహించారు. చెట్లు తొలగించే ముందు సెంటర్ లైటింగ్ స్తంభాలను తీయకుండా చెట్లను కూల్చి వేయటంతో పలు స్తంభాలు విరిగిపోయాయి. సుమారు ఐదు చోట్ల స్తంభాలు పనికిరాకుండా పోయాయి. సెంటర్ లైటింగ్ స్తంభాలు, ఇనుప గ్రిల్స్ ముందుగానే తొలగించి ఉంటే ఇవి ఉపయోగపడేవని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు వద్ద ప్రస్తావించగా నగర సుందరీకరణలో భాగంగా ఆయా ప్రాంతాల్లో కొత్త చెట్లను నాటడంతో పాటు సెంటర్ లైటింగ్ కోసం ఆధునిక స్తంభాలను వినియోగిస్తామని చెప్పారు. ఒకటి రెండు స్తంభాలు తుప్పుపట్టి పాడైపోయాయని తెలిపారు.

రాజ్యాంగ విలువలకు తిలోదకాలు



రాజ్యాంగ ప్రతులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: రాజ్యాంగ విలువలకు తిలోదకాలిచ్చేలా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు ధ్వజమెత్తారు. ఏఐసీసీ, పీసీసీ ఆదేశాల మేరకు అధ్యక్షుడు అంబటి కృష్ణారావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రెల్ల సురేష్ పలువురు కాంగ్రెస్ కార్యకర్తల ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకాకుళం పొట్టిశ్రీరాములు పెద్దమార్కెట్‌లో అసెంబ్లీ స్థాయిలో రాజ్యాంగ ప్రతిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని, అంబేడ్కర్‌ని అవమానిస్తూ బీజేపీ నాయకులు హేయంగా మాట్లాడుతున్నారన్నారు. ఈ విషయాన్ని పౌరులు గమనించి అడ్డుకోవాలని కోరారు. కార్యక్రమంలో గార మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అంబటి దాలినాయుడు, చాంద్ బాషా, షాదుల్లా ఖాన్, అంబటి లక్ష్మణరావు, సోడవరం చంద్రశేఖర్, సోడవరం లీలావతి, సూర్య బేగం తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి వచ్చారు



తల్లిదండ్రులు, అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు, బావామరుదులు, మనువళ్లు కలిసి సుమారు వంద మంది ఒకే కుటుంబానికి చెందిన వారంతా ఆదివారం వాండ్రంగి గ్రామంలో సందడి చేశారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన చౌదరి కుటుంబ సభ్యులంతా సంక్రాంతి సందర్భంగా గ్రామానికి చేరుకోవడంతో పండుగ వాతావరణం నెలకొంది. - జి.సిగడాం

భోగి మంటకు తాటాకులు



గ్రామాల్లో సంక్రాంతి సందడి నెలకొంది. సోమవారం భోగి పండుగ సందర్భంగా పెద్ద ఎత్తున మంటలు వేసేందుకు యువత సిద్ధమయ్యారు. ఈ క్రమంలో చెట్టుకొమ్ములు, పాత సామగ్రిని ఒకేచోటకు చేర్చే పనిలో యువకులు నిమగ్నమయ్యారు. ఫరీదుపేటలో ఏకంగా పచ్చి తాటాకులనే మంటల్లో వేసేందుకు తీసుకొచ్చారు.

- ఎచ్చెర్ల క్యాంపస్

కానరాని కాలువలు



నగరంలోని బాకర్‌సాహెబ్‌పేటలో కాలువలు లేక మురుగునీరంతా రోడ్డుపైనే నిలిచిపోతోంది. దీంతో అటువైపుగా రాకపోకలు సాగించేవారంతా ముక్కులు మూసుకుని వెళ్లాల్సి వస్తోంది. సాయంత్రం దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. అధికారులు స్పందించి కాలువలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

- శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

పిడికిట తలంబ్రాల పెళ్లికూతురు..



పాలకొండ రోడ్డులోని కోదండ రామాలయంలో ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా ఆదివారం గోదాదేవికి నీరాట్టు ఉత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు బంకుపల్లి శేషాచార్యులు అర్చకత్వంలో గోదాదేవిని పెళ్లికూతురుగా అలంకరించి పూజలు చేశారు.

- శ్రీకాకుళం కల్చరల్

ఉపనిషన్మందిరంలో గ్రంథావిష్కరణ



పుస్తకావిష్కరణలో రచయిత, నిర్వాహకులు

శ్రీకాకుళం కల్చరల్ : ఉపనిషన్మందిరం ఆధ్వర్యంలో 'విశ్వాసానికే దిక్సూచి – ఆ గురు శిష్యులు' గ్రంథాన్ని డాక్టర్ కె.సుధీర్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామకృష్ణ పరమహంస ఉపదేశాలు, వివేకానందుడి సందేశం వేర్వేరు కావన్నారు. పుస్తక రచయిత కాపవరపు నరసింహమూర్తి నేటి యువతకు చక్కని మార్గదర్శకంగా నిలుస్తూ గ్రంథాన్ని రాశారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కె.అమ్మన్నాయుడు, నిష్టల నర్సింహమూర్తి, సనపల నారాయణమూర్తి, బి.మల్లేశ్వరరావు, కోమలరావు, చాగంటి బాపయ్య, బొంతా వెంకటరావు, అప్పలకొండ, రామకృష్ణ, విశ్వేశ్వరరావు, కామేశ్వరరావు, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి



సుగుణాకరరావును సత్కరిస్తున్న గ్రామస్తులు

జి.సిగడాం: విద్యార్థులు నిర్దిష్ట లక్ష్యం పెట్టుకుని పట్టుదలతో సాధించాలని విశాఖపట్నం మహానగర కార్పొరేషన్ ఈఈ పాగిరి సుగుణాకరరావు అన్నారు. ఆదివారం పెంట గ్రామంలో హెచ్‌ఎం మజ్జి మదన్‌మోహన్ అధ్యక్షతన విద్య, ఉపాధి, వైద్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అంకితభావంతో చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

చోరీ కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల గ్రామంలోని ఉండట మల్లేసు ఇంట్లో గత ఏడాది మార్చిలో రెండున్నర తులాల బంగారం చోరీకి గురైంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూడటంతో బాధితులు ఆదివారం ఎచ్చెర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

ఫీల్డ్ అసిస్టెంట్ మృతికి సంతాపం

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేటలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ కొత్తకోట రంగనాథం ఆదివారం మృతిచెందారు. ఈయన మృతికి ఎంపీపీ మొదలవలస చిరంజీవి, ఎంపీడీవో శోభాదేవి సంతాపం తెలియజేశారు. రంగనాథం కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో పోరాడుతున్నారు. కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
శ్రీకాకుళం : 9951602845, 9951602849, 9912220367, 9705444191, 9010299083
ఎచ్చెర్ల : 9951602849
Office mail : sklmadvt@gmail.com